

హైదరాబాద్‌లో మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న నేతలు

# బీఆర్ఎస్‌లో చేరిన సీపీఐ నేతలు

**పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సమక్షంలో హైదాబాద్‌లో చేరిక**

ఖమ్మం, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ, ప్రతినిధి): బీఆర్ఎస్‌లోకి చేరికల పరంపరం కొనసాగుతోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి పెద్ద మొత్తంగా కాంగ్రెస్, బీజేపీ, సీపీఐ, టీడీపీ పార్టీ నేతలు చేరుతున్నారు. శనివారం సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, భద్రాచలం డివిజన్ సీనియర్ నాయకులు రావులపాటి రాంప్రసాద్, భద్రాచలం బీజేపీ టికెట్ ఆశించిన వెంకటాపురం ఎంపీపీ సతీశ్, సీపీఐ మండల కార్యదర్శి సునీల్, పలువురు సీపీఐ నాయకులు శనివారం ఎమ్మెల్సీ, భద్రాచలం ఎన్నికల ఇన్‌చార్జ్ తాతా మధుసూధన్ నేతృత్వంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో గులాబీ కండువాలు కప్పుకున్నారు. పార్టీలోకి చేరిన వారు భద్రాచలం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి తెల్లం వెంకటరావు విజయానికి కృషి చేయాలని కేటీఆర్ సూచించారు.

# బీఆర్ఎస్‌లోకి మడత వెంకట్‌గౌడ్


ఇల్లెందు రూరల్, నవంబర్ 11: ఇల్లెందు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మడత వెంకట్‌గౌడ్ బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ ఇల్లెందు, కొత్తగూడెం నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రి కేటీఆర్ సమక్షంలో ఆయన బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వెంకట్‌గౌడ్ మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి కృషిచేస్తానని, ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి హరిప్రియా నాయక్ గెలుపు కోసం శక్తివంచన లేకుండా పనిచేస్తానని అన్నారు. గతంలో దసరా ఉత్సవాలకు అనుమతి ఇప్పించాలని కోరుతూ మంత్రి కేటీఆర్‌ను తొర్రూరు సభలో కలిశానని అన్నారు. అనంతరం మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. వెంకట్‌గౌడ్‌కు పార్టీలో సముచిత స్థానం ఉంటుందని అన్నారు.

**రాబందులొద్దు..**

# రైతుబంధులే ముద్దు..

- కాంగ్రెస్‌ను కనికరిస్తే రాష్ట్రంలో మళ్లీ కరెంట్ కష్టాలు తప్పవు
- సాగునీరు, తాగునీరు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌దే..
- కొణిజర్ల ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ మదన్‌లాల్

కొణిజర్ల, నవంబర్ 11: సాగునీళ్లు, కరెంటు ఇవ్వకుండా అన్నదాతల ఆత్మహత్యలకు కారణమైన రాబందుల్లాంటి కాంగ్రెస్ పాలకులు మనకు వద్దని బీఆర్ఎస్ వైరా నియోజకవర్గ అభ్యర్థి బానోత్ మదన్‌లాల్ అన్నారు. నిరంతర విద్యుత్, పుష్కలంగా సాగునీరు అందిస్తున్న రైతుబంధువు లాంటి కేసీఆరే మనకు కావాలని స్పష్టం చేశారు. కాంగ్రెస్‌ను కనికరిస్తే రాష్ట్రంలో మళ్లీ మనకు కరెంటు కష్టాలు తప్పవని ఆందోళన వ్యక్తం చేశారు. కొణిజర్ల మండలంలో శనివారం పర్యటించిన ఆయన.. చిన్నగోపతి, అనంతారం, పెద్దగోపతి, పెద్దమునగాల, రెడ్డిగూడెం, సీతారాంపురం, పాతకాచారం, కాచవరం, చిన్నమునగాల గ్రామాల్లో ఆయన విస్తృతంగా ఎన్నికల ప్రచారంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రజలకు పూర్తి విశ్వాసం ఉందని, కేసీఆర్ సర్కారే తిరిగి అధికారంలోకి వస్తుందని, ఓటర్లు కూడా ఇందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఇంటింటికీ మిషన్ భగీరథ ద్వారా తాగునీరు, ఆసరా పింఛన్లు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ సాయాలు, రైతుబంధు పంటల పెట్టుబడి సాయాలు అందిస్తున్న సీఎం కేసీఆర్ ప్రజల హృదయాల్లో గూడుకట్టుకొని ఉన్నారని గుర్తుచేశారు. ఆయనను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. వైరాలో కారు గుర్తుకు ఓటు వేసి తనకు అధిక మెజార్టీ అందించాలని కోరారు. ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పోట్ల కవిత, వై.చిరంజీవి, ఏలూరి శ్రీనివాసరావు, పోట్ల శ్రీను, బోడపోతుల బాబు, చెరుకుమల్లి రవి, బూర ప్రసాద్, పొట్లపల్లి జీడయ్య, పొట్లపల్లి శేషగిరి, చల్లా మోహన్‌రావు, జడ మల్లేశ్, కిలారు కిరణ్, మూడ్ సురేశ్, కాల్వకట్ల వెంకటరత్నం, కొచ్చర్ల భిక్షం, విజయ్, రమేశ్, బ్రహ్మం, కృష్ణ, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.



కొణిజర్లలో వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి మదన్‌లాల్

# కేసీఆర్ బీమా.. ప్రజలకు ధీమా..

- ముఖ్యమంత్రి హామీ ఇచ్చారంటే పక్కాగా అమలుచేస్తారు..
- గ్యారెంటీ లేని కాంగ్రెస్ ఇచ్చే హామీలన్నీ గంగలో కలిసినట్టే..
- 16న ఖమ్మానికి రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ రాక
- ఖమ్మం నగర రోడ్‌షోలో బీఆర్ఎస్ అభ్యర్థి అజయ్‌కుమార్

ఖమ్మం, నవంబర్ 11: కేసీఆర్ బీమా.. ప్రతి ఇంటికీ ధీమాను ఇస్తుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, బీఆర్ఎస్ ఖమ్మం నియోజకవర్గ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చారంటే దానిని పక్కాగా అమలుచేస్తారని తేల్చిచెప్పారు. కానీ గ్యారెంటీ లేని కాంగ్రెస్ ఇచ్చే హామీలన్నీ గంగానదిలో కలిసినట్టేనని విమర్శించారు. ఖమ్మం నగరంలో శనివారం పర్యటించిన ఆయన.. 25, 26, 37, 38 డివిజన్లలో రోడ్‌షోలు నిర్వహించారు. ముందుగా చర్చికాంపౌండ్ నుంచి ప్రారంభమైన రోడ్‌షో రిక్కాబజార్, కమాన్‌బజార్, కస్బాబజార్, పాత మున్సిపల్ కార్యాలయం మీదుగా ఖిల్లాలోకి ప్రవేశించింది. ఆయా వీధుల్లో అజయ్ ఓటర్లను పలకరిస్తూ.. తనకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేస్తూ ముందుకుసాగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్



మంత్రి అజయ్ చేపట్టిన రోడ్‌షో ముందు భాగాన బీఆర్ఎస్ శ్రేణుల ర్యాలీ

ప్రభుత్వం అందించిన అనేక పథకాలను తానే స్వయంగా లబ్ధిదారుల ఇంటికి వెళ్లి అందించానని గుర్తుచేశారు. అదే సీఎం కేసీఆర్ అందించిన సహకారంతో ఖమ్మం నగరాన్ని అద్భుతంగా తీర్చిదిద్దానని వివరించారు. మనమంతా ఇంతలా కష్టపడి ఎంతో ప్రేమగా సుందరంగా నిర్మించుకున్న ఖమ్మాన్ని కాంగ్రెస్ చేతిలో పెట్టి మళ్లీ ఆగం చేసుకోకూడదని అన్నారు. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వాన్నే గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసుకుందామని అన్నారు. అయినా, గ్యారెంటీ లేని కాంగ్రెస్ పార్టీ 60 ఏళ్లు పాలించి కూడా ఖమ్మానికి చేసింది శూన్యమని విమర్శించారు. ఈ నెల 16న ఖమ్మం నగరానికి రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ వస్తారని, బీఆర్ఎస్ విజయాన్ని కాంక్షిస్తూ పలు డివిజన్లలో ప్రచారం చేస్తారని అన్నారు. అదే రోజు జరిగే బహిరంగ సభలో ప్రసంగిస్తారని అన్నారు. ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పునుకొల్లు నీరజ, ఫాతిమా, ముక్తార్, గోళ్ల చంద్రకళ, వెంకట్, ఆలీయా షౌకత్ అలీ, జహీర్ అలీ, మెహబూబ్ అలీ, ఖమర్, షౌకత్ అలీ, పల్లా రాజశేఖర్, ఖమర్, శౌకాత్, మెహబూబ్ అలీ, తాజుద్దీన్, శంశుద్దీన్, ఇసాక్, తౌసిఫ్, అప్సర్, ఫిరోజ్, ఇజ్హార్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో మూడోసారీ బీఆర్ఎస్‌దే అధికారం

- సీఎం సహకారంతో అన్ని రంగాల్లో సత్తుపల్లి అభివృద్ధి
- రాజ్యసభ సభ్యుడు పార్థసారథిరెడ్డి, ఎమ్మెల్యే సండ్ర
- కొత్తూరు గ్రామంలో బీఆర్ఎస్‌లోకి 11 కుటుంబాలు

సత్తుపల్లి రూరల్, నవంబర్ 11: తెలంగాణలో మూడోసారి కూడా బీఆర్ఎస్‌దే అధికారమని రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డి పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ సహకారం, ఎమ్మెల్యే సండ్ర కృషి కారణంగా సత్తుపల్లి నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని అన్నారు. ఇక్కడి ప్రజల ఆశీర్వాదంతో సండ్ర వెంకటవీరయ్య మూడుసార్లు సత్తుపల్లి ఎమ్మెల్యేగా గెలిచారని, మరోసారి ఆయనకు అవకాశం కల్పించి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలని ఆకాంక్షించారు. సత్తుపల్లిలో శనివారం పర్యటించిన పార్థసారథిరెడ్డి.. బీఆర్ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్యతో కలిసి కొత్తూరు గ్రామంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే సండ్ర

ప్రజల్లో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న సండ్ర వెంకటవీరయ్యను ఈ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కనివినీ ఎరుగని రీతిలో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్న సండ్రను ఆదరించాలని పిలుపునిచ్చారు. అనంతరం సండ్ర మాట్లాడుతూ.. తాను నాన్ లోకల్ అంటూ ప్రతిపక్ష నేతలు ప్రచారం చేస్తున్నారని అన్నారు. 15 ఏళ్లుగా ఇక్కడే ఉంటున్న తాను నాన్ లోకల్ ఎలా అవుతానో వారే సమాధానం చెప్పాలని ప్రశ్నించారు.

**బీఆర్ఎస్‌లోకి 11 కుటుంబాలు..**

బీఆర్ఎస్ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కొత్తూరులోని 11 కుటుంబాల వారు ఎంపీ బండి పార్థసారథిరెడ్డి, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యల సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు గొర్ల సంజీవరెడ్డి, కూసంపూడి రామారావు, కూసంపూడి మహేశ్, కొత్తూరు ఉమామహేశ్వరరావు, దొడ్డా శంకర్‌రావు, ఒగ్గు విజయలక్ష్మి, ఒగ్గు శ్రీనివాసరెడ్డి, పెద్దిరెడ్డి పురుషోత్తం, మందపాటి వెంకటరెడ్డి, తుమ్మూరు దామోదర్‌రెడ్డి, ఐనంపూడి సత్యనారాయణ పాల్గొన్నారు.

# పాలేరు నియోజకవర్గమంతా 'దళితబంధు'

- ఈ ఎన్నికలు ముగిసిన వెంటనే అమలుచేసేందుకు చర్యలు
- బీఆర్ఎస్ ప్రభుత్వం మళ్లీ గెలిస్తే మరిన్ని సంక్షేమ పథకాలు
- కూసుమంచి ఎన్నికల ప్రచారంలో పాలేరు ఎమ్మెల్యే కందాళ
- గిరిజనుల అభ్యున్నతే బీఆర్ఎస్ లక్ష్యం: డాక్టర్ చంద్రావతి

కూసుమంచి, నవంబర్ 11: పాలేరు నియోజకవర్గమంతటా దళితబంధు పథకాన్ని అమలు చేస్తామని పాలేరు ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ ఎన్నికలు ముగిసిన వెంటనే అమలుచేసేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. తెలంగాణలోనూ, పాలేరులోనూ మళ్లీ బీఆర్ఎస్‌ను గెలిపిస్తే నియోజకవర్గమంతటా దళితబంధు పథకాన్ని అమలుచేస్తామంటూ ఇటీవల జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అందుకు అనుగుణంగా నియోజకవర్గ ప్రజలు కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడితేనే మరిన్ని సంక్షేమ పథకాలు అమలయ్యే అవకాశం ఉంటుందని అన్నారు. మంచి పథకాలను అమలు చేస్తున్న ప్రభుత్వాన్ని ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలని కోరారు. తాను కూడా నియోజకవర్గంలో పార్టీలకు అతీతంగా ఆపదలో



గైగోళ్లపల్లి ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతున్న పాలేరు ఎమ్మెల్యే కందాళ

ఉన్న ప్రతి ఒక్కరికీ తనవంతు సహాయాన్ని అందించానని గుర్తుచేశారు. కూసుమంచి మండలంలో శనివారం పర్యటించిన ఆయన.. సంధ్యాతండా, లాల్‌సింగ్‌తండా, తుమ్మలతండా, గైగోళ్లపల్లి, ఉడతలగూడెం, హట్యాతండా, చింతలతండా, పోచారం, వెంకట్రాంపురం, ముత్యాలగూడెం, చేగొమ్మ గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానికుడిగా ఇక్కడి ప్రజల కష్టసుఖాల్లో తోడుగా నిలిచిన తనను ఈ ఎన్నికల్లో ఆదరించి ఆశీర్వదించాలని కోరారు. గ్రామాల్లోని అనేక సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేశానని అన్నారు. బీఆర్ఎస్ పాలేరు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ చంద్రావతి మాట్లాడుతూ.. గిరిజనుల అభ్యున్నతే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. తండాలను పంచాయతీలుగా తీర్చిదిద్ది వాటిల్లో మౌలిక సదుపాయాలు కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు రామసహాయం బాలకృష్ణారెడ్డి, బాణోత్ శ్రీనివాస్, ఇంటూరి బేబీ, బాణోత్ రాంకుమార్, వేములవీరయ్య, మల్లీడి వెంకటేశ్వర్లు, ముల్కూరి శ్యాంసుదర్‌రెడ్డి, శశికళ, వెంకట్, పుట్టా అంజయ్య, మంగ్యానాయక్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.